# సభ్యత

ఎక్కడో ఏదో ఫంక్షన్ జరుగుతూ ఉంటుంది! ఇన్నాళ్ళూ బుల్లితెరమీద దేదీప్య మానంగా వెలిగి - ఇటీవలే రాజకీయ రంగంలో ప్రవేశించిన ఓ మహానటుడు ఆ సభకి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిసి...

ఆయన ఎలా ఉంటాడో చూద్దామని కొందరూ-

ఏమ్మాట్లాడ్తాడో విందామని మరికొందరూ - ఉరుకులూ పరుగుల మీద సభాస్థలికి చేరుకుంటారు!

ఫంక్షన్ మొదలవుతుంది ! ముఖ్య అతిథి మాట్లాడటానికి మైకు ముందుకొస్తాడు ! అప్పటిదాకా రణగొణ ధ్వనుల్తో కోలాహలంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా సద్దుమణుగుతుంది!

ముఖ్య అతిథి గొంతు సవరించుకొంటాడు! జనం చెవులు రిక్కిస్తారు! కుర్రకారు కేరింతలు కొడ్తారు! జనాన్ని చూసి సదరు రాజకీయ నాయకుడి ఛాతీ ముప్పై అంగుళాలు మందుకు పొంగుతుంది!

ఉన్న ఫళాన, దేశాన్ని ఉద్ధరించేయాలన్నంత వెర్రి ఆవేశం పుట్టుకొస్తుంది!

ప్రతిపక్షం వాళ్ళనందర్నీ గుంటనక్కలనీ, దేశద్రోహులనీ, కుక్కమూతి పిందెలనీ ఏకి పారేస్తాడు!

చప్పట్లు సదరు నాయకుడికి మత్తెక్కించి- కిక్కిస్తాయని ఆయన ప్రత్యర్థులకి బాగా తెలుసు!

ఆయన నోట్లోంచి రాలే అవాకులూ, చవాకులూ ఎప్పుడెప్పుడు విని తరిద్దామా అని కాచుక్కూర్చుంటారు! తడవ తడవకీ తమ కరతాళ ధ్వనుల్తో అతడికి పూనకం తెప్పిస్తారు !

చప్పట్ల హోరుతో వెర్రెత్తిన నాయకుడు- వాళ్ళ ఎత్తులు గ్రహించకుండా - రెట్టించిన హుషారుతో ప్రత్యర్థుల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తూ - తన గొప్పలను... చెప్పిన గొప్ప చెప్పకుండా చెప్తూ - జనాన్ని ఊదరగొట్టేసి - శోష తెప్పిస్తాడు !

నాయకుడి స్వోత్కర్షలకీ - తిట్ల దండకానికీ దిమ్మతిరిగి - మూర్ఛిల్లిన జనం - స్పృహలోంచి తేరుకున్నాక - తమ నాయకుడి సభ్యతా సంస్కారాలేపాటివో తెలిసొచ్చి - అలాంటి సభకు వచ్చినందుకు తమనుతామే తిట్టుకుని లెంపలేసుకుంటారు!

ఇతర వ్యక్తుల్ని 'సభాముఖంగా' అసభ్య పదజాలంతో విమర్శించడం - సభ్య సమాజం అసహ్యించుకుంటుందన్న ఆలోచన ఆ నాయకుడికి లేకపోవడం శ్రోతల దురదృష్టం.

మనం ఆవేశంలో నిగ్రహాన్నీ - ఆరోపణల్లో సంయమనాన్నీ పాటించడం 'సంస్కారం' అనిపించుకుంటే.... మాటల్లో, నడతలో, వస్త్రధారణలో 'హుందా' తనాన్ని ప్రదర్శించటం 'సభ్యత' అన్పించుకుంటుంది.

సభ్యతా సంస్కారాలు మనిషికి రెండూ రెండు నేత్రాలైతే - ఏ నేత్రం లోపించినా అతడు నల్గురి దృష్టిలో సభ్యప్రపంచపు గడపతొక్కడానికి అనర్హుడవుతాడు!

1-10-195